క్లుప్తంగా

పేదలకు బియ్యం పంపిణీ

కర్నూలు(సెంట్రల్): రంజాన్ మాసం పురస్కరించుకొని ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో పేద మహిళలు, వితంతువులకు 25 కేజీల చొప్పున 220 మందికి బియ్యాన్ని పంపిణీ చేసినట్లు ఆ సంఘం నగర అధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్ గురువారం తెలిపారు. ప్రభుత్వం ముస్లింలకు రంజాన్ తోఫా ఇవ్వాలని కోరారు.

ఉత్తమ అధ్యాపక పురస్కారం


అక్తర్‌బానును అభినందిస్తున్న రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు

కర్నూలు కల్చరల్: క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిధిలోని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్. అక్తర్‌బాను ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని చెన్నై ఆమెట్ విశ్వవిద్యాలయం నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను గురువారం రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి అభినందించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కర్నూలు: నగర శివారులోని కోడుమూరు రోడ్డులో రిలయన్స్ మార్ట్ వెనుకవైపు ఉన్న రిచ్‌మండ్ విల్లాస్ వంద అడుగుల రోడ్డు పక్కన ఉన్న లోకల్ లారీ అసోసియేషన్ సమీపాన గురువారం గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. మృతురాలి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, ఎత్తు 5.2 అడుగులు ఉంటుందని, పసుపు రంగు చీర, ఆకుపచ్చ, గులాబీ రంగు పూల డిజైన్ కలిగిన జాకెట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవు.మతిస్థిమితం లేక కొంతకాలంగా ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ తిరుగుతుండేదని స్థానికులు తెలిపారన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. కేసు విచారణ చేస్తున్నారు.

మైపర్‌లో స్పోర్ట్స్ మీట్

కర్నూలు కల్చరల్: కర్నూలు ఏక్యాంప్‌లోని మైపర్ ఫార్మసీ కళాశాలలో గురువారం ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఎన్‌సీసీ కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ డొనాల్డ్ సైమన్ పీటర్స్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో తలపడ్డారు. డైరెక్టర్ ఆదిమూలపు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): తెలంగాణలో మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లోనూ కులగణన చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. కులగణన జరిగితే ఆయా వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు వీలుంటుందని, కులవృత్తుల అభివృద్ధికి చర్యలు తీసుకోవచ్చన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, కారన్న, శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

కర్నూలు(హాస్పిటల్): ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ముందు ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మునెప్ప మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఉన్నత ఆశయాలు కలిగి ఉండాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థులు ఉన్నత ఆశయాలు కలిగి ఉండి వాటిని సాధించేందుకు ప్రయత్నించాలని ఉస్మానియా కళాశాల కార్యదర్శి, కరెస్పాండెంట్ అజ్రా జావేద్ అన్నారు. కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన ఉద్యోగ శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె పాల్గొని మాట్లాడారు. యునెక్స్, ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్, ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ డాక్టర్ మండి అన్వర్‌హుసేన్, హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని ల్యాబ్‌లను సీజ్ చేయాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న డయాగ్నోస్టిక్ సెంటర్‌లను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు గురువారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళకు వినతి పత్రం సమర్పించారు. జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న మాట్లాడుతూ.. అనుమతుల్లేకుండా ల్యాబ్‌లను నిర్వహిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసు విధులపై అవగాహన

కర్నూలు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ సబ్‌డివిజన్ల పరిధిలో కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులకు, పోలీసు విధులపై అవగాహన కల్పించారు. స్టేషన్ల వారీగా ఓపెన్ హౌస్‌లు నిర్వహించి పోలీస్‌స్టేషన్‌లో విధులు, మహిళా సహాయ కేంద్రం, సిబ్బంది పనితీరు, వినియోగించే పరికరాలు, రికార్డుల నిర్వహణ తదితర వాటిని వివరించారు. మహిళా చట్టాలు, పోక్సో చట్టం, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాల ప్రభావం, సైబర్ నేరాలు, తీసుకోవలసిన జాగ్రత్తలతో పాటు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సేవల కోసం పోలీస్ హెల్ప్‌లైన్ 100/112, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ లైన్ నంబర్ 1098ను సంప్రదించాలన్నారు.

మండుతున్న ఎండలు.. జనం బెంబేలు

- నగరంలో చలువ పందిర్లు ఎక్కడ?
- బస్టాప్‌లు, సిగ్నళ్ల వద్ద ప్రజల ఇబ్బందులు
- ముఖ్య కూడళ్లలో చలివేంద్రాలు ఏవీ?
- స్పందించని మున్సిపల్ అధికారులు
- ఉపశమన ఏర్పాట్లు చేయాలని నగరవాసుల డిమాండ్


రాజ్‌విహార్ సెంటర్‌లో ఎలాంటి చలువ పందిళ్లు ఏర్పాటు చేయని దృశ్యం

కర్నూలు (టౌన్): ఏప్రిల్, మే నెలలో రావాల్సిన ఎండలు ముందే వచ్చాయి. ఫిబ్రవరి చివరి వారం నుంచే ఎండ వేడి, ఉక్కపోత ప్రారంభమైంది. మార్చిలోనే ఎండలు మేను తలపిస్తున్నాయి. పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, పిల్లలు, మహిళలు, ద్విచక్రవాహనదారులు ఇలా.. ప్రతిఒక్కరూ ఎండలకు బెంబేలెత్తిపోతున్నారు. ఉపశమన చర్యలపై నగరపాలక సంస్థ అధికారులు ఇప్పటివరకు దృష్టి పెట్టలేదు. గత ప్రభుత్వంలో మార్చి ప్రారంభంకల్లా నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. ముఖ్య కూడళ్లలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంచినీటి సౌకర్యం కల్పించారు. వేసవి కాలం ముగిసే వరకు ఈ చర్యలు చేపట్టడంతో ప్రజలు ఎంతో ఉపశమనం పొందారు. అయితే ప్రస్తుతం నగరపాలక యంత్రాంగం అలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మధ్యాహ్నం వేళ మంచినీటి కోసం పాదచారులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటిని కొనే పరిస్థితి వచ్చింది. వాహనాదారులు, బస్సు కోసం పిల్లపాపలతో వేచి ఉంటున్న మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సుల కోసం గంటల తరబడి ఎండలోనే వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చలువ పందిర్లు ఏవీ?

గత ప్రభుత్వంలో సి.క్యాంపు సర్కిల్, కలెక్టరేట్ బస్టాప్, రాజ్‌విహార్ సెంటర్ మూడు వైపులా, బళ్లారి చౌరస్తా, నగరపాలక సంస్థ బస్టాప్ ప్రాంతాలలో చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎండలు మండుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో చలువ పందిర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రాజ్‌విహార్, బళ్లారి చౌరస్తా, సీ.క్యాంపు వంటి ప్రాంతాల్లో సిగ్నళ్ల వద్ద ద్విచక్రవాహనదారులు ఎండలోనే వేచి ఉండాల్సి వస్తోంది. కొత్తబస్టాండ్ నుంచి రాజ్‌విహార్ మీదుగా కలెక్టరేట్ వైపు వెళ్లే వాహనదారులు, ఆర్టీసీ బస్సులు, కలెక్టరేట్ నుంచి పాతబస్టాండ్ వైపు వెళ్లే వాహనదారులు సర్కిల్ వద్ద ట్రాఫిక్ రెడ్‌లైట్ పడినప్పుడు ఎండలోనే వేచి ఉండాల్సి వస్తోంది. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సమయంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. అలాగే కలెక్టరేట్ వద్ద వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు మహిళలు, చిన్నారులు గంటల తరబడి వేచి ఉంటున్నారు. ఎండలతో ఇబ్బందులు పడుతూ మంచి నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రికి వచ్చే మహిళలు, వృద్ధులు సైతం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆయా ప్రాంతాల్లో చలువ పందిర్లు తక్షణం ఏర్పాటు చేయాల్సి ఉంది.

చలువ పందిళ్లు, చలివేంద్రాల సంఖ్య పెంచాలి

ఎండ వేడిమిని దృష్టిలో ఉంచుకొని నగరంలో చలువ పందిర్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. అదనంగా నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్, గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో, అలాగే బిర్లా సర్కిల్ వద్ద చలువ పందిర్లు ఏర్పాటు చేయాలి. వాటితో పాటు చలివేంద్రాల సంఖ్య పెంచాలి. బిర్లా సర్కిల్, పాతబస్తీ, నందికొట్కూర్ రోడ్డు బస్టాప్ వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఈ మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగరవాసులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కర్నూలులో ఈ వారం నమోదైన ఉష్ణోగ్రతలు	
1వ తేదీ	37 డిగ్రీలు
2వ తేదీ	37.5 డిగ్రీలు
3వ తేదీ	39.5 డిగ్రీలు
4వ తేదీ	39.1 డిగ్రీలు
5వ తేదీ	39 డిగ్రీలు
6వ తేదీ	37.7 డిగ్రీలు

చలివేంద్రాలు ఏవీ?

ఎండలతో ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనదారుల కోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఉంది. గతంలో రాజ్‌విహార్, కలెక్టరేట్, కొత్తబస్టాండ్, నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో, పాత బస్టాండ్, పెద్దమార్కెట్ వంటి ముఖ్య ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాలతో పాటు కొత్తపేట రైతుబజార్, సి.క్యాంపు రైతుబజార్ ప్రాంతంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



కలెక్టరేట్ వద్ద..





కలెక్టరేట్ బస్టాప్ వద్ద..



బస్సుల కోసం ఎండలో నిరీక్షిస్తున్న ప్రజలు

ఎఫ్‌ఏఓను సస్పెండ్ చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పదవీ విరమణ చేసి మూడేళ్లు పూర్తయినందున ఈపీఎఫ్ పింఛన్‌కు అర్హత సాధించినప్పటికీ బతికి ఉండగానే చనిపోయినట్లు ఉత్తర్వులిచ్చిన ఫైనాన్స్ అకౌంట్స్ ఆఫీసర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రీజినల్ గౌరవాధ్యక్షుడు అంజిబాబు, ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. దాదాపు 20 ఏళ్లు పనిచేసిన సయ్యద్ మాసుం వలీ బతికి ఉండగానే చనిపోయినట్లు అధికారులు సర్టిఫికెట్ ఇవ్వడాన్ని బట్టి చూస్తే వారు ఎంత నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారనేది స్పష్టమవుతోందన్నారు. మాసుంవలీ 2022 జూన్ 30న పదవీ విరమణ చేశారని, ఈపీఎఫ్ పింఛన్‌కు అర్హులైనప్పటికీ చనిపోయినట్లు నిర్ధారించడం దారుణమని వాపోయారు. జరిగిన తప్పిదాన్ని సవరించి న్యాయం చేయాలని కోరారు.

వేతనాలు పెంచాలి

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రేణుకమ్మ డిమాండ్ చేశారు. గురువారం అంగన్‌వాడీ వర్కర్ల గ్రాట్యూటీ అమలు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ ఇవ్వాలని కోరుతూ ఐసీడీఎస్ పీడీ నిర్మలకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 10వ తేదీన విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు.

పరీక్షల ఫలితాలకు నిరీక్షణ

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు తొమ్మిది నెలలుగా పరీక్షల ఫలితాలకై నిరీక్షిస్తున్నారు. 2022–24 బ్యాచ్ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు 38 మంది 2024లో జూన్‌లో నాల్గవ సెమిస్టర్ పరీక్షలు రాశారు. 9 నెలలు గడిచినా ఫలితాలు వెల్లడి గాకపోవడంతో గురువారం వర్సిటీకి చేరుకొని ఉన్నతాధికారులతో గోడు వెల్లబోసుకున్నారు. పది రోజుల్లోగా ఫలితాలు ప్రకటిస్తామని వర్సిటీ ఉన్నతాధికారి హామీ ఇవ్వడంతో వెళ్లిపోయారు.

సర్వేలు పకడ్బందీగా చేపట్టాలి


మూమెంట్ రిజిస్టర్ల నిర్వహణపై అసహనం వ్యక్తం చేస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు (టౌన్): నగరంలో పీ – 4 (పబ్లిక్ ప్రైవేటు పీపుల్స్ పార్టనర్‌షిప్) సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడు సూచించారు. ఆయన గురువారం స్థానిక రామలింగేశ్వర్ నగర్ – 115, కప్పల్ నగర్ – 117, అశోక్ నగర్ – 120 సచివాలయాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, సెలవు, మూమెంట్ రిజిస్టర్‌లను పరిశీలించారు. నమోదు ప్రక్రియ సక్రమంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. పనివేళల్లో సిబ్బంది తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని, నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం పనికి రాదన్నారు. అనంతరం సర్వేలు చేపడుతున్న తీరు, పన్ను వసూళ్ల పురోగతిపై ఆరా తీశారు. సచివాలయ పరిధిలో గృహాలు, వాణిజ్య దుకాణాలు, పన్ను డిమాండ్ అంశాలు అందుబాటులో ఉండాలని సూచించారు. పేదరిక నిర్మూలనకు సంబంధించి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వర్క్‌ఫ్రం హోమ్ సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. సచివాలయాల సిబ్బంది పనితీరు మెరుగుపడాలన్నారు. సూపరింటెండెంట్లు రామకృష్ణ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా ప్రజలు వడదెబ్బకు గురిగాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి సూచించారు. గురువారం స్థానిక ముజఫర్ నగర్‌లోని 82వ సచివాలయం పరిధిలో వడదెబ్బ నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఉదయం 10 గంటల్లోపు తమ పనులు ముగించుకుని నీడ ఉన్న ప్రదేశాల్లో ఉండాలని, ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, తలపై టవల్ పెట్టుకుని, కాళ్లకు చెప్పులు ధరించి వెళ్లాలని సూచించారు. నీళ్ల బాటిల్ వెంట తీసుకెళ్లాలని, గంట గంటకు నీరు తాగాలన్నారు. లేకపోతే శరీరంలోని నీరు, లవణాలు చెమట రూపంలో ఆవిరై నీరసంతో వడదెబ్బకు గురవుతారని చెప్పారు. వడదెబ్బ లక్షణాలు, ప్రథమ చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్త పుష్పావతి పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక తల్లి చెంతకు..


బాలికను తల్లికి అప్పగించిన పోలీసులు

కర్నూలు: కర్నూలు శివారులోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న శిరీష కూతురు హిమ (4) ఇంటి వద్ద ఆడుకుంటూ బయటకు వెళ్లి తప్పిపోయింది. తల్లి ఫిర్యాదుతో గంట వ్యవధిలోనే పోలీసులు బాలికను గుర్తించి తల్లి చెంతకు చేర్చారు. బయటికెళ్లిన కూతురు ఎంత సేపటికీ తిరిగి రాకపోవడం, చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో తల్లి మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. డీఎస్పీ బాబుప్రసాద్ నేతృత్వంలో సీఐ శేషయ్య, ఎస్ఐ మన్మథ విజయ్, సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. నంద్యాల చెక్‌పోస్టు దగ్గర్లోని గుడ్‌షప్పర్డ్ స్కూల్ వద్ద పాపను గుర్తించారు. డీఎస్పీ బాబుప్రసాద్ బాలిక తల్లి శిరీషను తన కార్యాలయానికి పిలిపించి హిమను అప్పగించారు. తల్లి ఆనందంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

12న చలో విజయవాడ

కర్నూలు(సెంట్రల్): ఉపాధి హామీ పథకం పరిరక్షణ, రైతుల డిమాండ్ల సాధన కోసం మార్చి 12న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేవీ నారాయణ పిలుపునిచ్చారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో చలో విజయవాడకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి కోతలు విధించిందన్నారు. రూ.లక్ష కోట్లకుగాను రూ.85 వేల కోట్లకు తగ్గించినట్లు చెప్పారు. అలాగే పంట దిగుబడులకు కనీస మద్దతు ధరం కోసం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బాలపీరా, వీరశేఖర్, లింగన్న, బాలకృష్ణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

11న వల్లకాడు వృత్తిదారుల ఆధ్వర్యంలో..

కర్నూలు(సెంట్రల్): వల్లకాడు వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 11న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్ పిలుపునిచ్చారు. గురువారం కేవీపీఎస్ కార్యాలయంలో చలో విజయవాడకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్మశానంలో గుంతలు తీసి శవాలను పూడ్చడం, కాల్చడం వంటి పనులు చేసే వల్లకాడు వృత్తిదారులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు ఎన్‌జీ కృష్ణ పాల్గొన్నారు.

పన్నులను సకాలంలో చెల్లించాలి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఇంటి, నీటి పన్నులను సకాలంలో చెల్లించాలని కమిషనర్ రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. నగరపాలక కార్యాలయంలో ఈనెల 31వ తేదీ వరకు సెలవు రోజుల్లోనూ పన్ను వసూలు కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు. అలాగే ప్రతిరోజు గంట పాటు అదనంగా తెరిచే ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

నేటి నుంచి తారావీ నమాజులు

కర్నూలు(అర్బన్): రంజాన్ మాసం పురస్కరించుకొని నగరంలోని పాతబస్తీ లవ్‌బాలి దర్గా ఆవరణలోని మసీదులో మూడు రోజుల పాటు ప్రత్యేక తరావీ నమాజులు (7,8,9 తేదీల్లో) ఉంటాయని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ది ఖురాన్ అకాడమీ ఫౌండర్ రిజ్వాన్ బాషా ఖాద్రి ఆధ్వర్యంలో ఈ నమాజులు జరుగుతాయన్నారు.

రంగనాథుడికి గజవాహన సేవ


గజవాహనంపై రంగనాథ స్వామి, హంస వాహన సేవలో..

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులం గోదా రంగనాయకి సమేత రంగనాథ స్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు గురువారం ద్వార తోరణ, ధ్వజ కుంభారాధన, శాత్తుమొర, ఉత్సవరులకు స్నపనం, అలంకారం సేవ, గజవాహన సేవ, హంసవాహన సేవ తదితర విశేష కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

తుంగభద్ర నదిని పరిరక్షించాలి

కర్నూలు (టౌన్): ఎక్కడి నుంచో వ్యర్థాలను తీసుకొచ్చి తుంగభద్ర నదిలో పడేస్తున్నారని, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టిన నదిని కాపాడాలని రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నగర పాలక సంస్థ ఎదుట రోజా వీధి, ప్రకాష్ నగర్‌కు చెందిన ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరంలోని వ్యర్థాలను తుంగభద్ర నది వెంట పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో సమీపంలోని కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుర్వాసనతో పాటు తుంగభద్ర నది ప్రాంతం కలుషితమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో దళితులు ఎక్కువగా నివశిస్తున్నారని వారంతా తుంగభద్ర నది వెంట పచ్చగడ్డి పెంచి అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వ్యర్థాలను పడేసే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు రామేశ్వరమ్మ, లలితమ్మ, బీసమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు ఇష్టంతో శ్రమించాలి



అతిథి మాలవరపు బాల లతతో అధ్యాపకులు, విద్యార్థులు

కర్నూలు కల్చరల్: ఆశయ సాధనకు ఇష్టంతో శ్రమిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ఫార్మర్ డిప్యూటీ డైరెక్టర్ మాలవరపు బాల లత అన్నారు. రవీంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ముగ్ధ–2025 వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్కిల్ ఎన్‌హ్యాన్స్‌మెంట్, కమ్యూనికేషన్స్ స్కిల్స్, న్యూ లాంగ్వేజెస్, కార్పొరేట్ స్కిల్స్‌ను దినచర్యలో చేర్చుకోవాలన్నారు. వాటిని రోజూ సాధన చేయడంతో విజయం చేరుకోవచ్చని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈ శ్రీనివాసమూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ ఉద్యోగులు

కర్నూలు: విధి నిర్వహణలో గుండెపోటుతో మృతిచెందిన ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణారెడ్డి, కానిస్టేబుల్ ఆంజనేయులు కుటుంబాలకు సహోద్యోగులు చేయూతనందించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ఎక్సైజ్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్లు వారి జీతాల నుంచి రూ.1,44, 000 పోగు చేశారు. ఈ మొత్తాన్ని డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి, ఈఎస్ సుధీర్‌బాబు, ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు రూ.72 వేలు చొప్పున అందించారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ అండ్ హెడ్ కానిస్టేబుల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులేసు, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఆటవిడుపు.. ఆనందం


లెమన్ స్పూన్ రేసులో పోటీ పడుతున్న మహిళా ఉద్యోగినులు

కర్నూలు(సెంట్రల్): ఒకవైపు కుటుంబం బాధ్యతలు.. మరోవైపు ఉద్యోగంతో తీరిక లేని జీవితం గడుపుతున్న ఉద్యోగునులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారు. అన్ని మరచిపోయి ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ కబుర్లు చెప్పుకుంటూ రోజంతా సంతోషంగా గడిపారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియం ఆవరణలో మహిళా ఉద్యోగునులకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. పోటీలను డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ ప్రారంభించారు. దాదాపు 150 మంది ఉద్యోగినులు టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, షటిల్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, షాట్ పుట్, షటిల్ తదితర క్రీడల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి మహిళా దినోత్సవం రోజున బహుమతులను అందజేస్తారు. సర్వజన ప్రభుత్వ వైద్యశాల ఏఓ సింధుసుబ్రమణ్యం, మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ కన్వీనర్ యాని ప్రతాప్, ప్రెసిడెంట్ దీప, ఏపీ జేఏసీ ఉమెన్ వింగ్ చైర్మన్ సహారాబాను, జనరల్ సెక్రటరీ సి.పద్మావతి, ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సరస్వతి పాల్గొన్నారు.

స్త్రీ, పురుషులు సమానమే


ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తి లీలా వెంకట శేషాద్రి, తదితరులు

కర్నూలు కల్చరల్: అన్ని రంగాల్లో మహిళలు సాధించిన విజయాలకు గుర్తుగా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ కళాశాలలో మహిళా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆయన ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ.. సాంఘిక రాజకీయ సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ పురుషులు సమానమని చెప్పడమే మహిళా దినోత్సవ ఉద్దేశమన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కర్నూలు కల్చరల్: స్త్రీలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఫర్‌మెన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా శాంతి అన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం మహిళలు ఆత్మరక్షణ కోసం తీసుకోవాల్సిన డిఫెన్స్ స్కిల్స్‌పై ఏపీ కిక్ బాక్సింగ్ సెక్రటరీ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ నరేంద్ర ఆచారి అవగాహన కల్పించారు. మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో 'మహిళలు – పోషక విలువలతో కూడిన ఆహారం' అనే అంశంపై చిరుధాన్యాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మహిళలకు ఆటవిడుపు అవసరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): మహిళలకు ఉద్యోగ బాధ్యతతో పాటు ఆటవిడుపు అవసరమని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ మైదానంలో ఆటల పోటీలను ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఏడీ అనిల్‌కుమార్‌రెడ్డి, సావిత్రిబాయి, బంగి శ్రీధర్,సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరదా.. సరదాగా


మ్యూజికల్ చైర్ పోటీలో నర్సులు

కర్నూలు(హాస్పిటల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా నర్సింగ్ సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. గురువారం ఆసుపత్రిలోని డైట్ ఆవరణలో నిర్వహించిన ఈ పోటీలను నర్సింగ్ సూపరింటెండెంట్‌లు సావిత్రిబాయి, విమలమ్మ ప్రారంభించారు. ఇందులో టగ్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ తదితర ఆటలను నర్సింగ్ సిబ్బంది ఆడారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని సరదాగా గడిపారు. అసోసియేషన్ అధ్యక్షురాలు లీలావతి, సెక్రటరి బంగారి, ఉపాధ్యక్షులు శాంతిభవాని, ట్రెజరర్ లక్ష్మీనరసమ్మ, ఈసీ మెంబర్లు శాంతిలత, కృష్ణవేణి, హెడ్‌నర్సులు, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.